

ఘట్‌కేసర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ, ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

# ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ బౌల్డ్

- అభివృద్ధి చేసినం..ఓట్లు అడుగుతున్నాం
- ప్రతిపక్షాలకు సినిమా చూపిస్తాం
- ప్యాకేజీ మాస్టర్‌లతో ఒరిగేదేమి లేదు
- మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్, నవంబర్ 5 : ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను క్లీన్ బౌల్డ్ చేస్తామని, డిపాజిట్ కూడా దక్కకుండా చేస్తామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, ఘట్‌కేసర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభ, రోడ్ షోలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌లను రాత్రింభవళ్లు కష్టపడి అభివృద్ధి చేశామని, అందుకే ఓట్లు అడుగుతున్నామన్నారు. శ్మశానవాటిక, రోడ్లు, డంపింగ్‌యార్డులు, తదితర వాటిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. ఒక్క బీఆర్‌ఎస్‌కే ఓట్లు అడిగే హక్కు ఉందని, కాంగ్రెస్ ఏమి చేసిందని ఓట్లు అడుగడానికి వస్తున్నారని ప్రశ్నించారు. మేడ్చల్ ప్రజల ఓట్లతో ఎంపీగా గెలిచిన రేవంత్ నాలుగేండ్లలో ఒక్కసారి కూడా ప్రజలకు ఎక్కడా కన్పించలేదన్నారు. వజ్రేశ్ యాదవ్, ప్యాకేజీ మాస్టర్లు కాంగ్రెస్ గెలుస్తుందని అంటున్నారని, ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఇంకా ఎన్నికలు జరిగేలోపు ఇంకా రెండు షోలు ఉన్నాయని, వాటితో కాంగ్రెస్ మైండ్ బ్లాక్ కావడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి, గతంలో కంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంత మంది ప్యాకేజీ మాస్టర్‌లు కాంగ్రెస్‌లో చేరినా బీఆర్‌ఎస్ గెలుపును అడ్డుకోలేరన్నారు. అవాకులు, చెవాకులు పేలి, ఆపద మొక్కులు మొక్కి గెలుస్తామని అనుకుంటున్నారని విమర్శించారు. వారిని తరిమి కొట్టాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బోడుప్పల్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, జవహర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేషన్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, పీర్జాదిగూడ కార్యక్రమంలో మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో మంత్రి మల్లారెడ్డి రోడ్ షో కు తరలివచ్చిన జనం

## అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌వన్: హోం మంత్రి

ఘట్‌కేసర్ : సీఎం కేసీఆర్ కృషితో తెలంగాణ అభివృద్ధిలో దేశంలోనే నం.1గా నిలిచిందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం రాత్రి ఘట్‌కేసర్‌లో పది వేల మందితో బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో హోంమంత్రి, మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సీఎం కేసీఆర్ చేపడుతున్నారని తెలిపారు. దీంతో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు సీఎం కేసీఆర్‌ను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు.

## సుస్థిర పాలన
# బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, చిత్రంలో ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబర్ 5: రాష్ట్రంలో సుస్థిరమైన పాలన బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉందని, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించే పార్టీలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని సింగాడకుంటలో స్థానిక బీఆర్‌ఎస్ నేత ఎజాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి ఆదివారం మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్‌లో శాంతిభద్రతలు కాపాడటంతో పాటు ప్రజల్లో స్నేహాభావాన్ని పెంపొందించారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి దేశంలో ఎక్కడ జరగలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్, బీజేపీలు అబద్దాలతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయని, వారి మాటలు నమ్మొద్దని ప్రజలకు సూచించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని, ప్రతిపక్షాల మాటలు నమ్మితే నట్టేట మునగడం ఖాయమని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. కర్నాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మోసపోయామని బాహాటంగానే చెబుతున్నారని, అలాంటి పొరపాటు తెలంగాణ ప్రజల ఎన్నటికీ చేయరని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నాసర్, నాయకులు మహ్మద్ ఎజాజ్, శంకర్, నరేశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలకు ఓటేస్తే అభివృద్ధి శూన్యం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

మణికొండ, నవంబర్ 5 : కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడుతుందని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపల్ పరిధిలో అసోసియేషన్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు నీలేశ్ ప్రసాద్ దూబే ఆధ్వర్యంలో ఆనంద పోయెట్రీ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ.. అక్రమాలు, అన్యాయాలు చేసే నాయకులను బలపరిస్తే అభివృద్ధి శూన్యమన్నారు. మూడు పర్యాయాలుగా నియోజకవర్గానికి దాదాపు 1500 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద పోయెట్రీ అసోసియేషన్ తీర్మానం చేసి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్.నర్సింహ, మణికొండ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు నీలేశ్ ప్రసాద్ దూబే, నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్, ఆనంద పోయెట్రి అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొండాకు కరువైన అండ..!

- పార్టీ మారే యోచనలో మాజీ పార్లమెంట్ సభ్యుడు ?
- జన సేనకు టికెట్లు కేటాయించొద్దని కాషాయంతో అమీతుమీ
- విశ్వేశ్వర్ రెడ్డిని పట్టించుకోని కమలం

సిటీబ్యూరో, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : కమలంలో 'కొండా' రచ్చ రోజురోజుకు వేడెక్కుతోంది. జనసేన పొత్తును ఆది నుంచి వ్యతిరేకించిన మాజీ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కాషాయం పెద్దలు లైట్ తీసుకున్నారు. ఒకవేళ పొత్తు ఉన్నా తన చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఒక్క సీటు కూడా జనసేనకు కేటాయించడానికి వీలు లేదని రాష్ట్ర అధ్యక్షుడికి అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే ఆ నియోజకవర్గం నుంచి తమ అనుచరులు ఎమ్మెల్యే అభ్యర్థులుగా దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. జనసేన పొత్తు ఖాయమైనప్పటి నుంచి కొండా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని ఆ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

### ఏ పార్టీలోకో..!

తాండూరును జనసేనకు కేటాయించడంతో కొండా నైరాశ్యంలో మునిగిపోయారు. మరో నియోజకవర్గం శేరిలింగంపల్లి కూడా జనసేనకు కేటాయించడం 90 శాతం ఓకే అయినట్టు తెలిసింది. పవన్ కల్యాణ్ ఆ స్థానం పై పట్టు పడుతున్నట్టు సమాచారం. దీంతో కిషన్ రెడ్డి కూడా జనసేనకు కేటాయించడానికే ఆసక్తిగా ఉన్నారు. ఈ వ్యవహారంతో చేవెళ్ల పార్లమెంట్ తన నుంచి జారిపోతుందని కొండా భావిస్తున్నారు. తాండూరు, శేరిలింగంపల్లి నాయకులంతా కొండాతో సమావేశమయ్యారు. బీజేపీని వీడాల్సిన సమయం వచ్చిందని కొండా భావిస్తున్నట్టు తెలిసింది. ఈ లెక్కన కొండా త్వరలోనే కారు లేదా చెయ్యిచూసుకోబోతున్నట్టు కూడా వార్త లు వినిపిస్తున్నాయి.

రేపు ఎల్బీస్టేడియంలో జరిగే బీసీ సభకు ప్రధాని రానున్నారు. దీంతో శేరిలింగంపల్లి సీటు జనసేనకు అప్పగిస్తే కచ్చితంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి పార్టీ మారే అవకాశం ఉందని రాష్ట్ర కాషాయ పార్టీ వద్ద రిపోర్ట్ ఉన్నట్టు సమాచారం. కొండా ప్రధాని సభ వరకు వెయిట్ చేస్తారా ? లేదా ముందుగానే తన దారి చూసుకుంటాడా అనేది హాట్ టాపిక్‌గా మారింది.

# గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రామ్మోహన్‌గౌడ్, లక్ష్మీప్రసన్న తదితరులు

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి రామ్మోహన్‌గౌడ్ వెల్లడి
- కార్యకర్తల కోలాహలం మధ్య కలిసిన ఇరువురు నాయకులు

వనస్థలిపురం, నవంబర్ 5: ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే, ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీఎన్‌రెడ్డి నగర్‌లోని రామ్మోహన్ గౌడ్ నివాసంలో ఇరువురు నాయకులు కలిశారు. నియోజకవర్గం నుంచి తరలివచ్చిన కార్యకర్తల కోలాహలం మధ్య సుధీర్‌రెడ్డి రామ్మోహన్‌గౌడ్ నివాసానికి వచ్చారు. కలిసి అల్పాహారం తీసుకున్న తర్వాత వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. తమ మధ్య విభేదాలు తొలగిపోయాయన్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఎల్బీనగర్‌లో, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గెలిచి, కేసీఆర్ హాట్రిక్ సీఎం కావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అన్ని డివిజన్‌లలో కార్యకర్తలను సమన్వయం చేసి, కలిసిగట్టుగా పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఓటరును కలిసి బీఆర్‌ఎస్ గెలుపు ఆవశ్యకతను వివరించాలన్నారు. ఎల్బీనగర్‌ను అభివృద్ధి చేసింది, తామిద్దరమేనని తెలిపారు. మిగతా నాయకులు అతిథిలా వచ్చి వెళ్లేవారని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని వారు భరోసానిచ్చారు. గతం ఓ పీడ కల అని.. మర్చిపోవాలని క్యాడర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న, పలు డివిజన్‌ల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.